ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక


Bullet Edition

గురువారం 15 మే 2025 www.prajaswaramdaily.com




# ఆర్టీఐ నూతన కమిషనర్ల ప్రమాణం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కు కొత్తగా నియమితులైన కమిషనర్ల పదవీ స్వీకార ప్రమాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చీఫ్ కమిషనర్ జి. చంద్రశేఖర్ రెడ్డి గారు నూతన కమిషనర్లుగా నియమితులైన వారితో ప్రమాణం చేయించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన కమిషనర్లుగా నియమితులైన పీవీ శ్రీనివాస రావు , మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యా రెడ్డి వరుసగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నూతన కమిషనర్లకు అభినందనలు తెలియజేశారు.



# గవర్నర్ ను కలిసిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్: గత పదేళ్లుగా నెలకొన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గవర్నర్ కు వివరించారు. భూ భారతి చట్టాన్ని గత 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని ఈ నెల 5వ తేదీ నుంచి 28 మండలాల్లో అమలు చేస్తున్నామని గవర్నర్ కు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించారు. గవర్నర్ ఆలోచన, సీఎం సూచనల మేరకు గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా 500-700 ఇళ్లను మంజూరు చేస్తున్నామని, ఐటీడీఏ పరిధిలో చెంచు కుటుంబాలకు పదివేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇవాళ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాజ్ భవన్ లో మంత్రి పొంగులేటి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, భూభారతి చట్టం అమలును తెలిపారు. మొదటి దశలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపట్టామని గవర్నర్ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుకుంట, గొగులపూడి, ఆదిలాబాద్ జిల్లా ఝర్కి, మంగ్లీ, నాగర్ కర్నూల్ జిల్లా అప్పాపూర్, బౌరాపూర్ గ్రామాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య డీల్

## రేవంత్ స్థానంలో కేసీఆరే సీఎం..!

## మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు.



హైదరాబాద్ : బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తున్న, ఇకముందు కూడా చేస్తానని హరీష్ రావు చెప్పుకున్నారు.. కేటీఆర్ నాయకత్వంలో కూడా పని చేస్తానని వివరించుకున్నారు.. ఎందుకు హరీష్ రావు అలా మాట్లాడారన్నది ఇప్పుడు ప్రధాన అంశమని ఆయన అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన పూర్తి అయి.. కాంగ్రెస్ పాలన ప్రారంభమైందని అన్నారు. జూన్ 2 లేదా డిసెంబర్ 9 తరువాత కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం తథ్యమని ఆయన సంచలన కామెంట్స్ చేశారు.

ఇందులో భాగంగా ముఖ్యమంత్రి మార్పు ఖాయం.. రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ది దారుల ఎంపికలో అనేక అవకతవకలు జరిగాయి.. ఒక్క గ్రామంలో పేద, దళిత, దివ్యాంగ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు రాలేదని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపైన విచారణ జరిపించాలని ఆయన అన్నారు.

# మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ముందస్తు బెయిల్

## గతంలో భూ ఆక్రమణ కేసులో దర్యాప్తునకు సహకరించాలన్న హైకోర్టు

## హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టులో జీవన్ రెడ్డి సవాల్

## విచారించిన అనంతరం బెయిల్ ..



హైదరాబాద్ : మొయినాబాద్ భూఆక్రమణల కేసులో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. గతంలో.. మొయినాబాద్ భూఆక్రమణల కేసులో జీవన్ రెడ్డి పిటిషన్ ను హైకోర్టు కొట్టేసింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆయన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో.. హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టులో జీవన్ రెడ్డి సవాలు చేశారు. విచారించిన సుప్రీంకోర్టు... ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ... దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని స్పష్టం చేసింది. జీవన్ రెడ్డి విచారణకు సహకరించకుంటే అధికారులు చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

# ఇందిర సౌర గిరిజన వికాసం

## 18న సీఎం చేతులమీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ప్రారంభోత్సవం

## ఆదాయం లేకున్నా అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నాం

## బీఆర్ఎస్ అప్పులు చేసి దిగిపోయింది

## సంక్షేమ ఫలాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నాం

## 90 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం

## డిప్యూటీ సీఎం భట్టి



రాష్ట్రంలో ఆదాయం లేకపోయినా.. క్రమం తప్పకుండా వడ్డీలు చెల్లిస్తూనే ఉన్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ ఆయన మధిర నియోజకవర్గం ఎర్రుపాలెంలో మీడియాతో మాట్లాడారు. పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని మభ్యపెట్టిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ చేతిలో పెడితే.. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయిందని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా.. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఆదాయం లేకపోయినా అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి కీలక వ్యాఖ్యలు పేర్కొన్నారు. 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందజేస్తున్నామని అన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూ.9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. జూన్ 2న లబ్ధిదారులకు ఆర్థిక సాయానికి సంబంధించి ధృవీకరణ పత్రాలను అందజేస్తామని అన్నారు. రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో సిబిల్ స్కోర్ పేరుతో అసత్య ప్రచారం జరుగుతోందని ఆయన మండిపడ్డారు.

రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇదిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఇళ్లు లేని వాళ్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయం, ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏటా రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలపై పన్నుల భారం మోపకుండా కాంగ్రెస్ సర్కార్ సమర్థవంతంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ఇందిర సౌర గిరిజన వికాసం కింద ఆదివాసీ రైతులకు బోర్లు, సోలార్ పవర్‌తో నడిచే పంప్‌సెట్లు, డ్రిప్ పరికరాలను అందజేస్తామని అన్నారు. ఈనెల 18న నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి ఆ పథకాన్ని ప్రారంభించబోతున్నారని తెలిపారు

# కేంద్ర నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలం

## ఆ ఉగ్రవాదులను అప్పగించాకే పాక్‌తో చర్చలు జరపాలి

## సీపీఐ నేత నారాయణ



తిరుపతి : పహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో కేంద్ర నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. జమ్మూ కాశ్మీర్‌లో పానీపూరి బండి నడుపుకునే వ్యక్తికి తెలిసిన సమాచారం కూడా కేంద్ర నిఘావర్గాలకు తెలియడం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఇక, పహల్గామ్‌లో దాడి చేసిన ఉగ్రవాదులను వెంటనే పాకిస్తాన్ అప్పగించాలని డిమాండ్ చేశారు.. ఆ ముగ్గురు ఉగ్రవాదులను అప్పగించిన తర్వాతనే పాక్‌తో భారత్ చర్చలకు వెళ్లాలని సూచించారు.. ఉగ్రవాదులను అంతం చేసేంత వరకు నిద్రపోకూడదన్నారు..దేశంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్న బీజేపీ నేతలే దేశం విడిచి వెళ్లిపోవాలని మండిపడ్డారు.. నక్సలైట్లను చంపేస్తానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పడం సరైన పద్ధతి కాదన్న ఆయన.. అరాచకాలను సృష్టించే ఉగ్రవాదులతో కేంద్రం మాట్లాడేటప్పుడు.. నక్సలైట్లతో ఎందుకు మాట్లాడకూడదు? అని నిలదీశారు. అమిత్ షా వెంటనే నక్సలైట్లను చర్చలకు పిలవాలి.. నక్సలైట్లను చంపొచ్చు.. కానీ, వారి సిద్ధాంతాలను చంపలేరన్నారు.. బీజేపీని వ్యతిరేకించే వారిని కలుపుకొని తాము ముందుకు వెళ్తామని ప్రకటించారు .